క్లుప్తంగా

పక్షవాత బాధితుని కుటుంబానికి నిత్యావసరాలు



తెనాలిటౌన్: అంగలకుదురులో పక్షవాతంతో బాధపడుతున్న ఉక్కళం శ్రీనివాసరావు కుటుంబాన్ని మంగళవారం జైభీమ్ ఫెడరేషన్ నాయకులు పరామర్శించారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న శ్రీనివాసరావు కుటుంబానికి ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కొలవరపు దేవరయ్య, మహిళ ప్రధాన కార్యదర్శి పేరం అరుణ నిత్యావసర వస్తువులు, బియ్యం అందజేశారు. ఆర్థిక సహాయాన్ని శ్రీనివాసరావు భార్య గురవమ్మకు అందజేశారు. సేవా కార్యక్రమంలో భాగంగా తమ వంతుగా సరుకులు అందించినట్లు దేవయ్య తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రామారావు, సభ్యులు పాల్గొన్నారు.

కొలకలూరులో పోస్టల్ పొదుపు మేళా



తెనాలిటౌన్: రూరల్ కొలకలూరులోని పుర వేదిక వద్ద మంగళవారం పోస్టల్ పొదుపు మేళాను తపాలాశాఖ అధికారులు నిర్వహించారు. సదస్సులో డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి మాట్లాడుతూ 55 ఏళ్ల లోపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ సహాయం పొందే సంస్థల ఉద్యోగులకు రూ.50 లక్షల వరకు బీమా రక్షణ ఉందని తెలిపారు. ఇన్సూరెన్స్ పాలసీలు, టర్మ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి యోజన, ఎస్‌బీ ఖాతాలు, రికరింగ్ డిపాజిట్‌లపై అవగాహన కల్పించి వివరించారు. సదస్సులో డివిజనల్ ఫీల్డ్ ఆఫీసర్ సత్యనారాయణ, కొలకలూరు సబ్ పోస్ట్ మాస్టర్ శ్రీనివాసరావు, పోస్ట్‌మెన్‌లు లక్ష్మయ్య (ఖాజీపేట), షేక్ నజీముద్దీన్ (కొలకలూరు), బి.వి.రత్నం(గుడివాడ), ఎం.ఫణికుమార్ (కోపల్లె), సుకన్య (కొలకలూరు) తదితరులు పాల్గొన్నారు.

కోడి పందెం స్థావరాలపై దాడులు

కొల్లూరు : కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై పోలీసులు దాడులు చేసి, పందెం నిర్వాహకులను అదుపులోకి తీసుకున్న ఘటన సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ శామ్యూల్ రాజీవ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఈపూరు పరిసర ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో.. కొల్లూరు పోలీసులు దాడులు నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తున్న మూడు స్థావరాలపై దాడులు జరిపి ఆరు కోడి పుంజులతోపాటు.. కోడి కత్తులు, రూ.3,020 నగదు స్వాధీనం చేసుకున్నారు. 12 మంది జూదరులను అదుపులోకి తీసుకొన్నారు. క్రాంతి పండుగ సమయంలో.. ఈపూరు పరిసర ప్రాంతాల్లో కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించి, 13 కేసులు నమోదు చేసి 52 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఈ-క్రాప్‌లో పంట నమోదు తప్పనిసరి

వేమూరు: రబీలో సాగు చేసే పంటలను రైతులు ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చందోలు సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జొన్న, మొక్క జొన్న, మినుము, పెసర పంటల సాగు చేస్తున్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో అందజేయాలని పేర్కొన్నారు.

చందోలులో ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో 40వ మంగళ వారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళ వారం వివాహం కాని ఆడపిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరిగేందుకు ప్రత్యేకంగా హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం మహా గౌరీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ వంశ పారంపర్య అర్చకులు కుంచల బళ్ళారెడ్డి, నరసారెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలి

ఎమ్మెల్యే శివకుమార్



నిత్యావసరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: తల్లిదండ్రులను జీవితాంతం మమతానురాగాలతో చూసుకోవాల్సిన బాధ్యత బిడ్డలపై ఉందని, పెద్దలను ఆదరించిన బిడ్డలే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ అభిప్రాయపడ్డారు. 15వ వార్డులోని ఖాజానగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ యువ నేత షేక్ గౌస్ తన తల్లిదండ్రులు షేక్ పెద్ద ఖాజావలి, బీబీజాన్ జ్ఞాపకార్థం పలు వితరణ కార్యక్రమాలను చేపట్టారు. 15వ వార్డులో 115 పేద కుటుంబాలకు 10 కిలోల బియ్యం, కిలో మినపపప్పు చొప్పున ఎమ్మెల్యే శివకుమార్ చేతులమీదుగా పంపిణీ చేశారు. అక్కడి సమీపంలోని ముస్లిం మదరసాకు రూ.10 వేలు విరాళం అందించారు. బీసీ కాలనీలో మసీదు నిర్మాణానికి వారు సూచించిన మేరకు ఒక గజం స్థలం విలువ రూ.6 వేలను అందజేశారు. ఈ వితరణలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో పట్టించుకోని బిడ్డలు కనిపిస్తున్న నేటి కాలంలో కన్ను మూసిన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం భారీస్థాయిలో వితరణ చేస్తున్న షేక్ గౌస్, ఆయన కుటుంబ సభ్యులు అభినందనీయులన్నారు. పేదలకు సాయపడటం మనిషి బాధ్యతని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే శివకుమార్ గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షలకుపైగా పేదలకు ఇళ్లస్థలాలను పంపిణీ చేయటమే కాకుండా ఇళ్ల నిర్మాణం పూర్తిచేసే పనిలో ఉన్నట్టు చెప్పారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు కౌసర్ జహా, బి.శివకృష్ణ, ఎస్.వెంకట్రావు, స్థానిక పెద్దలు షేక్ సాయిబాబు, కె.రామమోహనరావు, ముతవల్లీ ఖాశిం పాల్గొన్నారు.

ముగిసిన టీపీఎల్

తెనాలిరూరల్: స్థానిక కొత్తపేటలోని తాలూక జూనియర్ కాలేజి ఆవరణలో నిర్వహిస్తున్న తెనాలి ప్రీమియర్ లీగ్ (టీపీఎల్ సీజన్-6) ముగిసింది. మంగళవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. తెనాలి బ్లాక్ పాంథర్స్, తెనాలి రాయల్ లైయన్స్ మధ్య హోరాహోరిగా జరిగిన ఈ మ్యాచ్‌లో బ్లాక్ పాంథర్స్ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో బ్లాక్ పాంథర్స్ జట్టు సభ్యుడు సంతోష్ 12 బంతుల్లో 59 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ క్రీడాకారులందరికీ బహుమతులు ప్రదానం చేశారు. ఆయన చేతుల మీదుగా గెలుపొందిన, ఓడిన క్రీడా జట్లకు నగదు బహుమతిని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా పాల్గొన్న ప్రతి ఒక్క క్రీడాకారునికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో యువ క్రికెట్ అకాడమీ డైరెక్టర్ హరిదాసు గౌరీశంకర్, కోచ్ షేక్ మాలిక్, కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, మామిడిబత్తుల సుబ్రమణ్యం, షేక్ మీరావలి, బాకర్, కుర్రా శ్రీను, తస్నీరు శివశంకర్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.





విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

గుల్లబారేది ఇందుకండి!

పద్దెనిమిదేళ్ల రాము సైకిల్ తొక్కుతూ కిందపడ్డాడు. పైకి గాయాలేవి లేకపోవడంతో ఊపిరి పీల్చుకుని, లేచి సర్దుకుని ఇంటికి బయల్దేరాడు. ఎడమ కాలు కాస్త నొప్పిగా ఉంటున్నా.. అంతే మొండిగా ఉండసాగాడు. ఇక మూడు రోజులకు కాలంతా బరువుగా, అడుగు తీసి అడుగువెయ్యలేని పరిస్థితి ఏర్పడింది. వైద్యులను సంప్రదించడంతో ఆస్టియోపోరోసిస్ వ్యాధి కారణంగా గుల్లబారి కాలి ఎముక విరిగిందని చెప్పడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. శరీరానికి తగినంత ఎండ తగలకపోవడం, వ్యాయామం లేకపోవడం, పోషకాహారం లోపంతో ఇటువంటి పరిస్థితి తలెత్తుతుందని వైద్యులు తెలిపారు.

- చిన్నదెబ్బలకే విరిగిపోతున్న ఎముకలు
- విటమిన్ 'డి' లోపమే ప్రధాన కారణం
- యువతలో పెరుగుతున్న ఆస్టియోపోరోసిస్





గుంటూరు మెడికల్: చిన్న చిన్న దెబ్బలకే ఎముకలు విరిగిపోవటం ఆస్టియోపోరోసిస్ వ్యాధి (బోలు ఎముకల వ్యాధి) సోకినవారిలో కనిపించే ప్రధాన లక్షణం. మనిషికి వయస్సుమీద పడే కొలది అనేక రకాల వ్యాధులు సోకి బాధిస్తాయి. అలాంటి వాటిల్లో ఆస్టియోపోరోసిస్ ఒకటి. ఆధునిక జీవనశైలి వల్ల నేడు యువతలో కూడా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తూ ఉండటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లల్లో చాలా మంది ఎండ ఏ మాత్రం తగలకుండా ఏసీ గదుల్లో ఉండి పోతున్నారు. ఆటలు ఆడేందుకు కూడా ఎండలోకి ఏ మాత్రం రాకుండా గదుల్లోనే ఉండి పోతూ ఉండటంతో పాఠశాల విద్యార్థులకు ఏదైనా దెబ్బతగిలిన సమయంలో ఊరికినే ఎముకలు విరిపోతున్నాయి. సాధారణంగా ఆడవాళ్లలో మోనోపాజ్ దశ దాటిన తరువాత 40 ఏళ్లలో, మగవాళ్లలో 50 ఏళ్ల వయస్సులో ఈ వ్యాధి వస్తోంది.

వ్యాధి లక్షణాలు...

వయస్సు పైబడిన వారిలో నడుంనొప్పి, వెన్నుముక ఎదుగుదల లోపించి ఎత్తు ఆగిపోవటం, ఒళ్లంతా నొప్పులు, ఏ పని చేయలేకపోవటం, నీరసం, నిస్సత్తువ, నిరాశ, ఓపిక లేకపోవటం తదితర లక్షణాలు ప్రాథమిక దశలో కనిపిస్తాయి. ఎండనుంచి శరీరానికి లభించే డీ విటమిన్ లభించకపోవటం కూడా వ్యాధి సోకటానికి ఒక కారణం. వ్యాధి లక్షణాలు కన్పించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా ఆర్థోపెడిక్ వైద్యుడిని సంప్రదించాలి. అశ్రద్ధ చేసే వెన్నుపూస, చేతిమణికట్టు, తుంటి వద్ద ఏ మాత్రం చిన్నదెబ్బతగిలినా చివరకు ఇంటి గడప కాలికి తగిలినా ఎముకలు విరిగిపోతాయి.

వ్యాధి సోకటానికి కారణాలు...

కుటుంబంలో ఎవరికైనా ఒకరికి వ్యాధి ఉంటే వారసత్వంగా ఇతరులకు వచ్చే అవకాశం ఉంది. సరైన పోషకాహారం తీసుకోకపోవటం, మద్యపానం, ధూమపానం లాంటి చెడు అలవాట్లు, థైరాయిడ్, లివర్ వ్యాధుల వల్ల, కొన్ని రకాల మందులు వాడటం ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. రోజంతా ఏమాత్రం ఎండలో రాకుండా ఏసీలోనే గంటలతరబడి గడపటం వల్ల ఈ వ్యాధి వస్తుంది. శారీరక వ్యాయామం ఏ మాత్రం చేయనివారికి, ముఖ్యంగా ప్రతిరోజూ కనీసం అరగంటకూడా నడవకపోవటం వల్ల ఇది సోకుంది. రక్తపరీక్షల ద్వారా, ఎక్సరే ద్వారా, ఎముకల సాంద్రత పరీక్షల ద్వారా వ్యాధి సోకిందా లేదా అనే విషయాలు తెలుస్తాయి.

బాధితులు అధికమే...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 150 మంది ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతి వైద్యుడి వద్దకు ప్రతి రోజూ 40 మందికి పైగా వివిధ రకాల సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో సగం బాధితులు ఆస్టియోపారోసిస్ బాధితులే. కీళ్లవాతం, కిడ్నీ వ్యాధులు, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారికి ఆస్టియోపారోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది కాబట్టి వీరికి ముందస్తుగా పరీక్షలు చేయించాలి.

నివారణ చర్యలు...



వ్యాధికి చికిత్సలో భాగంగా శరీరంలో క్యాల్షియం లెవల్స్ పెంచాలి. పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవటం ద్వారా క్యాల్షియం పెంచుకోవచ్చు. విటమిన్ డి కోసం ప్రతిరోజూ కొంత సేపు ఎండలో ఉండాలి. కింద పడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వయస్సు మళ్లిన వారికి విటమిన్ డి, క్యాల్షియం మాత్రలు ఇవ్వాలి. రోగులను ఖాళీగా ఉంచకుండా వారికి ఏదోఒకపని వ్యాపకం కల్పించాలి. పోషకాహారాన్ని అందించాలి. పొగతాగటం, మద్యం సేవించటం లాంటి చెడు అలవాట్లు విడనాడాలి. ప్రతిరోజూ తప్పనిసరిగా అరగంటసేపైనా నడవాలి.

– డాక్టర్ జె.నరేష్‌బాబు, సీనియర్ స్పయిన్ సర్జన్, గుంటూరు

క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం

వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి రాజీవ్



క్రీడాకారులకు షీల్డ్ అందజేస్తున్న రాజీవ్, ఎంపీపీ

నగరం: క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం పెంపొందుతుందని వైఎస్సార్ సీపీ నాయకుడు మోపిదేవి రాజీవ్ పేర్కొన్నారు. మండలంలోని ఈదుపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా మంగళవారం బహుమతి ప్రధానోత్సవ సభలో రాజీవ్ పాల్గొని, మాట్లాడారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్‌లు దోహదపడతాయన్నారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య మాట్లాడుతూ.. టోర్నమెంట్‌లో 43 జట్లు పాల్గొనగా చెరుకుపల్లి ఈవూరు గణేష్ టీమ్ ప్రథమ, ఈదుపల్లి టీమ్ ద్వితీయ, ఇంటూరు టీమ్ తృతీయ స్థానంలో నిలిచాయని తెలిపారు. వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు ప్రోత్సాహక నగదు, షీల్డ్‌లను ఆయా జట్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతల పవన్‌కుమార్, చందోలు దేవదాసు, వైఎస్సార్ సీపీ నాయకులు పురం వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాలో నగదు విత్‌డ్రాపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: తనకు తెలీకుండా తన బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు విత్‌డ్రా అయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరామ్‌నగర్‌కు చెందిన దిల్ బహదూర్ సోమవారం చుట్టుగుంట సమీపంలోని చికెన్‌షాపునకు వెళ్లాడు. చికెన్ కొనుగోలు చేసే క్రమంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఇంటికి వచ్చిన కొంతసేపటి తరువాత అతని కుమారుడు హరిబహదూర్ సెల్‌కు మెసేజ్ వచ్చింది. మెసేజ్ పరిశీలించగా దిల్ బహదూర్ బ్యాంక్ అకౌంట్‌లోని రూ.30వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్‌లో ఉండటం చూసి ఖంగుతిన్నాడు. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణ మండపాన్ని త్వరలో పూర్తి చేస్తాం

మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: కల్యాణ మండపాన్ని త్వరలో పూర్తి చేస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని దేవరంపాడు దేవస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం, అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ వచ్చే తిరుణాళ్లకల్లా భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ నుంచి మంజూరైన రూ . 99 లక్షలతో మండపానికి ఇరువైపుల భక్తుల సౌకర్యార్థం మెట్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి మంజూరైన నిధులతో రూమ్‌లు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. దాతలు ముందుకు వచ్చి దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని కోరారు.



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, దేవస్థానం కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు, జీడీసీఎంఎస్ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, సర్పంచులు సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, నకరికల్లు మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక కళాకారుడు వెంకయ్యకు సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం చండశాసనుడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం ఉమ్మడి కుటుంబం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ పౌరాణిక, రంగస్థల కళాకారుడు మోదుకూరు వెంకయ్యను సన్మానించారు. కార్యక్రమంలో షేక్ సుభానీ, పఠాన్ కరిముల్లా, షేక్ అజీమ్‌తుల్లా, షేక్ షబ్బీర్, అలపాటి కరుణ, మోదుకూరు శారమ్మ, పెమ్మసాని పోతురాజు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవానీ, అయినాల మల్లేశ్వరరావు, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, అజీజ్, షేక్ గౌస్, హేమంత్‌కుమార్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వెంకయ్యను సన్మానిస్తున్న సుభానీ, కరిముల్లా తదితరులు

పీకలవాగులో వ్యర్థాలను తొలగించండి

పట్నంబజారు: నివాసగృహాల మధ్యన పెద్దఎత్తున మురుగునీరు పారుదలవుతున్న పీకల వాగులో వ్యర్థాలు తొలగించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఏటుకూరురోడ్డులోని డీఎస్ నగర్, ఆర్.అగ్రహారం, నిమ్మలపేట, చెంచుకాలనీల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో నివాస గృహాల మధ్య పీకలవాగు ఉన్న క్రమంలో వ్యర్థాలు పేరుకుపోయి, మురుగునీరు పారుదల అవక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే ముస్తఫా దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా నివాసాల మధ్య ఖాళీస్థలాలు ఉండటంతో పిచ్చిమొక్కలు, వ్యర్థాలు నిల్వ చేరుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన ఖాళీస్థలాలు శుభ్రపరిచి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని శానిటరీ అధికారులకు సూచించారు. నిమ్మలపేట, చెంచుకాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్పొరేటర్ వేముల జ్యోతిపద్మజ, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, అచ్చిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

టీఎంఎం మారథాన్‌లో నిహాల్‌కు ద్వితీయ స్థానం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 15న ముంబయిలో జరిగిన టాటా ముంబయి మారథాన్ (టీఎంఎం) చాంపియన్‌షిప్‌లో ఓవరాల్ విభాగంలో గుంటూరుకు చెందిన నిహాల్ అహ్మద్ బేగ్‌కు ద్వితీయ స్థానం దక్కిందని అతని తల్లిదండ్రుల పర్వీన్ బేగ్, అహ్మద్ బేగ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 42.82 కిలోమీటర్ల దూరాన్ని నిహాల్ 2 గంటల 28 నిమిషాల, 17 సెంకెండ్లలో పూర్తి చేసాడన్నారు. రన్నర్‌కు రూ.50 వేలు నగదు బహుమతి అందించారని చెప్పారు. తొలిస్థానం కర్నాటకు చెందిన నంజుడప్పకు దక్కిందన్నారు.



ద్వితీయ స్థానం పొందిన నిహాల్ అహ్మద్ బేగ్ (పొడవుగా ఉన్న వ్యక్తి)

వైభవంగా పునీత అంతోని చర్చి తిరునాళ్ల

తురకపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని తురకపాలెం గ్రామంలోని శ్రీపునీత అంతోనివారి చర్చి వార్షిక తిరునాళ్ల మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా చర్చిని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. సుమారు 125 సంవత్సరాల పైగా చరిత్ర కలది. పలు ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులంతా తిరునాళ్లకు సొంత గ్రామానికి వచ్చి ఘనంగా జరుపుకుంటారు. తిరునాళ్లలో భాగంగా ఉదయం 5గంటలకు చర్చిలో ఆలయ విచారణ గురువులు వై.థామస్ ఆధ్వర్యంలో దివ్యపూజ నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం సమిష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. నల్లపాడు విచారణ గురువు కె.ఇన్నారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకరరెడ్డి చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ గురువు వై.థామస్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం నుంచి కొవ్వొత్తుల సమర్పణ చేశారు. సాయంత్రం 4 గంటలకు బాణాసంచా కాలుస్తూ గ్రామంలో తేరు ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు చర్చిలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు..



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి



విజేతలకు బహుమతులు అందిస్తున్న కోటేశ్వరరావు తదితరులు

నిజాంపట్నం: మహిళల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ముగ్గుల పోటీలు దోహదపడతాయని జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా అడవులదీవి పంచాయతీ వీరంకి వారిపాలెం గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి సాధించిన యామిని అనే మహిళకు రూ.3,116లు నగదును భాగ్యలక్ష్మి అందించారు. ద్వితీయ బహుమతిని మాణిక్యంకు, రూ.2116లు ఎంపీటీసీ రాజేష్‌కన్నా, తృతీయ బహుమతి అనూషాకు రూ.1516లను యార్లగడ్డ వెంకట రాంబాబు అందజేశారు. పాల్గొన్న మహిళలకు ప్రోత్సాహక బహుమతులుగా చీరలు, పసుపు కుంకుమలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యార్లగడ్డ మదన్ మోహన్, వీరంకి రమణ, వీరంకి శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ వీరంకి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

చెరుకుపల్లి: మండలంలోని ఆరుంబాక పంచాయతీ కామినేనివారి పాలెంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు చిన్నారులకు మంగళవారం ముగ్గులు, పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్, ఆరుంబాక సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, పీటా నాగరాజు, అమర్తలూరి నాగరాజు, క్రాప రవికుమార్, పీటా శ్రీనివాసరావు, పేరం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యలపై 21న సదస్సు

రేపల్లె: జై భీమ్ భారత్ పార్టీ ఇండియన్ యూనియన్, ముస్లిం లీగ్ పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విజయవాడలోని శ్రీరామ ఫంక్షన్ హాలులో ముస్లిం, మైనార్టీల సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు జై భీమ్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి దోవా రమేష్ రాంజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారానికై నిర్వహించే సదస్సులో ముస్లిం మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.